## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:05 | సంచిక:39 | సోమవారం అక్టోబర్ 26, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## మన్‌కీ బాత్ ఓ పవిత్ర యాత్ర:

12 ఏళ్లుగా కొనసాగుతున్న మన్‌కీబాత్.
ప్రజల సేవా దృక్పథాన్ని కొనియాడిన మోదీ.
పంజాబ్‌లో సేంద్రియ, సంప్రదాయ సాగుకు ప్రోత్సాహం.
వర్షపునీటి సంరక్షణతో పునరుజ్జీవం పొందిన హెవల్ నది.



పన్నెండేళ్ల క్రితం విజయదశమి నాడు మొదలుపెట్టిన 'మన్‌కీబాత్' ప్రజల సహకారంతో అప్రతిహతంగా కొనసాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. 139వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో ఆయన ప్రసంగించారు. పంజాబ్ సంప్రదాయ వ్యవసాయం, ఉత్తరాఖండ్ మహిళల సాధికారత వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.మన్‌కీబాత్ ప్రారంభం నాటి విషయాలను ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. "12 ఏళ్ల క్రితం విజయదశమి నాడు మొదలైన ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ప్రజలు ఈ ప్రయాణంలో భాగస్వాములు, మార్గదర్శులుగా మారారు. ప్రజల కఠిన శ్రమ, ధైర్యం, అంకితభావం, సేవా దృక్పథాన్ని కొనియాడేందుకు ఇది ఒక అద్భుతమైన అవకాశం. తీర్థయాత్రలు ఎలానో.. నాకు మన్‌కీ బాత్ అలానే ఉంటుంది. పంజాబ్‌లో చేపట్టిన ఖేతీ విరాసత్ మిషన్ స్ఫూర్తిమంతంగా ఉంది. ఆర్గానిక్, సంప్రదాయ సాగుకు పునరుజ్జీవం కల్పించేందుకు ఇది పనిచేస్తోంది. పంజాబ్ మాల్వా ప్రాంతంలో పత్తి సాగును ఈ బృందం ప్రోత్సహిస్తోంది. ఇక ఉత్తరాఖండ్ గఢ్వాల్ ప్రాంతంలో ప్రజలు హెవల్ నదికి ఊపిర్లూదారు. కొన్నాళ్ల క్రితం వరకు ఇందులో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో స్థానిక యంత్రాంగం, గ్రామస్థులు వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు చర్యలు తీసుకొన్నారు. భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. ఈ చర్యల ఫలితంగా నేడు నది తిరిగి కళకళలాడుతోంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఓటు మీదే..

## పోరాటం కూడా మీదే:

### ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు

- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ ర్యాలీ.
- ర్యాలీకి ప్రచారం చేస్తున్న భాజపాపై రాహుల్ వ్యంగ్యం.
- ఓటర్ల పేర్ల తొలగింపుపై రాహుల్ ఆరోపణలు.
- నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపు.


2లో

## ఆరు నెలల్లో 23 మరణశిక్షలు..! జడ్జి బదిలీ

ఆరు నెలల వ్యవధిలోనే పలు కేసుల్లో 23 మందికి మరణశిక్ష విధిస్తూ ఓ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులు ఇటీవల చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. తాజాగా ఆ న్యాయమూర్తిని అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు ముజఫర్‌నగర్‌లోని ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఫాస్ట్-ట్రాక్ కోర్టులో ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన పదవీకాలంలో హై ప్రొఫైల్ తీర్పులు వెలువడడం, తన కోర్టులో పెండింగులో ఉన్న కేసుల ఉపసంహరణలపై ప్రశ్నలు లేవనెత్తిన సమయంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.


2లో

## తుపాను ముప్పును సమర్థంగా ఎదుర్కొందాం


2లో

- అర్నబ్ తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష.
- ఈ నెల 28న బాపట్ల--విశాఖ మధ్య తీరం దాటే అవకాశం.
- ప్రమాదకర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం.

# తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కీలక భేటీ..

# ముంబైకి సీఎం రేవంత్ రెడ్డి



తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై చర్చించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర పర్యటనకు బయలుదేరనున్నారు. ఆదివారం రాత్రి 7 గంటలకు హైదరాబాద్ నుంచి ముంబైకి వెళ్లనున్న సీఎం.. అక్కడే రాత్రి బస చేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశం కానుంది. ఈ భేటీలో ప్రధానంగా తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించనున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.


2లో

## అర్నబ్ తుపాను..

### ఏపీలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

విశాఖపట్నం: బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం సోమవారం తూర్పు, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశముందని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు.

# రెండో పంట వేయొద్దు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో కరవు పరిస్థితులను గుర్తించి.. రెండో పంట సాగు చేయొద్దని రైతులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఎల్‌నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ కొనడానికి కూడా దొరకడం లేదని అన్నారు. రాష్ట్రంలో నెలకున్న కరవు పరిస్థితులపై సమావేశం ఏర్పాటు చేసి ప్రతిపక్ష పార్టీల నుంచి సూచనలు తీసుకుంటామని చెప్పారు. పేదలకు మంచి చేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని పేర్కొన్నారు.

ఆదివారం ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.38 కోట్లతో చేపట్టిన రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేయని కార్యక్రమాలు ఇందిరమ్మ ప్రభుత్వం చేస్తుంటే తమపై విషం కక్కుతున్నారంటూ ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి కుంటు పడనీయలేదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా.. పేదలకు అన్ని కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మొదటి పంట సాగు చేసిన రైతులకు అన్ని రకాలుగా సహకరించామని గుర్తు చేశారు. తెలంగాణలో కేంద్రంలో అధికారంలో ఉన్న వారి పార్టీ లేదని చిన్న చూపు చూడొద్దని రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలకు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణా రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే తీసుకురావాలని వారికి సూచించారు. ప్రభుత్వానికి సూచనలు చేయాలని రైతులను ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.



## తుపాను ముప్పు..

### రానున్న ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

- అర్నబ్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత ఆదేశం.
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం.
- బుధవారం బాపట్ల--విశాఖ మధ్య తుపాను తీరం దాటే సూచనలు.
- గంటకు 115--125 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం.
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, బీచ్‌లలోకి పర్యాటకులను అనుమతించవద్దని సూచన.


2లో

## కన్నడిగులకు ఐటీ ఉద్యోగాలివ్వకపోతే కఠిన చర్యలు తప్పవు: డీకే శివకుమార్


2లో

## భారత బలగాలకు అందని


2లో

## బోయిగూడలో ముదిరాజ్‌ల అలై బలై..

## ఘనంగా అవార్డు ప్రదానోత్సవంలి

### ముదిరాజ్ భవన్‌లో ఉత్సాహంగా జరిగిన వేడుకలు.. తోటల సుజాత ముదిరాజ్‌కు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అవార్డు



**మల్కాజిగిరి జనసముద్రం న్యూస్ అక్టోబర్ 25**

బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో అలై బలై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతి రత్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , కాసాని వీరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.నావాడ ముత్తయ్య ముదిరాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు ముదిరాజ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు తోట సురేందర్ ముదిరాజ్, మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శారద ముదిరాజ్, రాష్ట్ర యువత అధ్యక్షులు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో వినాయక్ నగర్ డివిజన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు తోటల సుజాత ముదిరాజ్‌కు జాతి రత్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అవార్డును అందజేశారు.

ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పి.ట్ల రాజు ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, మురళి ముదిరాజ్, చైతన్య ముదిరాజ్, దినేష్ ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు. పలువురు ముదిరాజ్ నాయకులు, మహిళలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహేశ్వరం అభివృద్ధిలో మరో ముందడుగు.. శ్రీవెన్ అర్బన్ హెవెన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**జనసముద్రం న్యూస్ మహేశ్వరం :**



మహేశ్వరం మండల కేంద్రంలో నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్టుల నిర్మాణానికి మరో ముందడుగు పడింది. మహేశ్వరం పట్టణంలోని మన్సాన్‌పల్లి రోడ్డులో ఉన్న స్మార్ట్ సిటీ వెంచర్ లో నూతనంగా నిర్మించనున్న శ్రీవెన్ అర్బన్ హెవెన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు మాజీ మంత్రివర్యులు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహేశ్వరం పట్టణం, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న నివాస అవసరాలకు అనుగుణంగా నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ఏర్పాటు కావడం అభివృద్ధి పరంగా ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లో నివాస సదుపాయాలు, మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి ప్రాజెక్టులు స్థానిక ప్రాంత అభివృద్ధికి తోడ్పడే అవకాశం ఉంది.

మహేశ్వరం మండల కేంద్రం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పాటు, వివిధ ప్రాంతాలకు రాకపోకలకు అనుకూలంగా ఉండటం వల్ల నివాస, వాణిజ్య రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహేశ్వరం పట్టణంలో కొత్త నివాస ప్రాజెక్టుల నిర్మాణం స్థానికంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి, నిర్మాణ రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందించే అంశంగా నిలుస్తోంది.

మన్సాన్‌పల్లి రోడ్డులోని స్మార్ట్ సిటీ వెంచర్ లో ఏర్పాటు కానున్న శ్రీవెన్ అర్బన్ హెవెన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావడంతో స్థానిక ప్రాంతంలో కొత్త నివాస సముదాయానికి మార్గం సుగమమైంది. ప్రాజెక్టు నిర్మాణం నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తయి, అవసరమైన సదుపాయాలతో అందుబాటులోకి రావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య పోతర్ల అంబయ్య స్వర్ణగంటి ఆనందం సుధీర్ గౌడ్ ఉపసర్పంచ్ జోరల రమేష్ పిఎసిఎస్. డైరెక్టర్ పోల్కం బాలయ్య సున్నం కృష్ణ ఆవులకాడి శ్రీశైలం గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్ దుద్దు కృష్ణ యాదవ్

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## గాజుల మణెమ్మ మృతి పట్ల మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంతాపం.

**జనసముద్రం న్యూస్ మహేశ్వరం :**



మహేశ్వరం మండల ప్రజాతంత్రం న్యూస్ రిపోర్టర్ గాజుల నర్సింహా మాతృమూర్తి కీర్తిశేషులు గాజుల మణెమ్మ ఇటీవల పరమపదించారన్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి వారి నివాసానికి చేరుకుని మణెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం గాజుల నర్సింహా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, మణెమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి తీరని లోటు కలిగిందని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మణెమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య,పోతర్ల అంబయ్య,స్వర్ణగంటి ఆనందం,సుధీర్ గౌడ్, ఉపసర్పంచ్ జోరల రమేష్,పిఎసిఎస్. డైరెక్టర్లు కాడమోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, నాయకులు సున్నం కృష్ణ,ఆవులకాడి శ్రీశైలం,మహేశ్వరం మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిద్దింటి సిద్దార్థ, గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్, దుద్దు కృష్ణ యాదవ్,నరేష్, మహేష్, సంగం,చింటూ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# తుపాను ముప్పు..

మొదటిపేజీ తరువాయి

అమరావతి: అర్నబ్ తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఏపీ హోంమంత్రి అనిత ఆదేశించారు. రానున్న ఐదు రోజులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం నుంచి విస్తారంగా.. మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం బాపట్ల-విశాఖ తీరాల మధ్య తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయని.. ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని చెప్పారు.

ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బీచ్‌లలోకి పర్యాటకులను అనుమతించవద్దన్నారు. భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, వ్యాప్తి చేయవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ జారీ చేసే అధికారిక హెచ్చరికలను పాటించాలని మంత్రి అనిత కోరారు.

# అర్నబ్ తుపాను..

## ఏపీలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం సోమవారం తూర్పు, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశముందని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు. ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెంది అదే రోజు మధ్యాహ్నానికి బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 140 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ఈ తుపానుకు బంగ్లాదేశ్ సూచించిన 'అర్నబ్' (జఎఔశ్రీశీఅవ ూతీఱఖఎ) పేరు పెట్టిన విషయం తెలిసిందే.

తుపాను దృష్ట్యా ఈ నెల 27న ఏపీలోని కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. కడప, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. 28వ తేదీన కూడా పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

## కన్నడిగులకు ఐటీ ఉద్యోగాలివ్వకపోతే కఠిన చర్యలు తప్పవు: డీకే శివకుమార్

మొదటిపేజీ తరువాయి

బెంగళూరు: కర్ణాటకలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థలు ముఖ్యంగా ఐటీ కంపెనీల యాజమాన్యాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియామక ప్రక్రియలో కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నట్లు తేలితే ఆయా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికుల హక్కులు, గౌరవం, ఉద్యోగ అవకాశాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని ఆయన అన్నారు. బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, వీటిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.కన్నడ ప్రజల హక్కులు, గౌరవానికి ఇబ్బంది కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అనుమతించబోదన్నారు. కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యాలను చూసి రాష్ట్రం గర్విస్తోందన్నారు. ఏదైనా ప్రైవేటు సంస్థ వారిని ఉద్దేశ పూర్వకంగా పక్కన పెడితే.. కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కన్నడిగులకు ఉద్యోగాల అంశంపై సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ఇటీవల వైరల్ అయ్యాయి. తాజాగా రెజ్యూమ్‌లో భాష స్థానంలో కన్నడ అని ప్రస్తావించినందుకు తన దరఖాస్తును తిరస్కరించారని చెబుతూ ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా ట్యాగ్ చేశారు. ఇదే తరహా ఫిర్యాదులు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీఎం తీవ్ర స్థాయిలో స్పందించారు.

## భారత బలగాలకు అందని లక్ష్యం లేదు: ఐఏఎఫ్ చీఫ్

మొదటిపేజీ తరువాయి



భారత బలగాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పేర్కొన్నారు. గతేడాది పాక్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయన్నారు. ఆ సమయంలో వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న అణ్వాయుధాలు, కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు. ఆ ఆపరేషన్ లో స్వదేశీ ఆయుధాల శక్తిని ప్రపంచ దేశాలు చూశాయని పునరుద్ఘాటించారు. స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోందన్నారు. అక్టోబరు 31న పదవీ విరమణ చేయనున్న ఏపీ సింగ్.. పీటీఐతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచ దేశాల్లో అస్థిరత కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. దేశ భద్రతను సుస్థిరం చేసేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతంలో మన శక్తి సామర్థ్యాల ప్రదర్శన ఎంతో ముఖ్యమని ఐఏఎఫ్ చీఫ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. 'జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు, ఇండో-పసిఫిక్‌లో నెలకొన్న పరిస్థితిని వైమానిక దళం నిశితంగా పర్యవేక్షిస్తోంది. దేశ భద్రతను కాపాడటానికి ఐఏఎఫ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మరింత సంక్లిష్టమైన విన్యాసాలు, కార్యాచరణల ద్వారా మిత్రదేశాల వైమానిక దళాలతో పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తున్నాం. ఇండో-పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడానికి అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్ సభ్య దేశాలతో కలిసి భారత్ పనిచేస్తోంది. ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లకు ఇటీవల ఐఏఎఫ్ పంపిన దళాలు సుదూర కార్యకలాపాలు, సముద్ర వైమానిక కార్యకలాపాలలో విలువైన అనుభవాన్ని అందించాయి' అని ఏపీ సింగ్ పేర్కొన్నారు.

భారత్, అమెరికా సహా ఇతర దేశాలు స్వేచ్ఛాయుత, శాంతియుత ఇండో-పసిఫిక్ కోసం ఒత్తిడి చేస్తున్నప్పటికీ.. వనరులు సమృద్ధిగా ఉన్న ఈ ప్రాంతంలో చైనా తన సైనిక బలాన్ని పెంచుకోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాయు సేనాధిపతి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# ఓటు మీదే..

# పోరాటం కూడా మీదే:

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండుతో ఇండియా కూటమి నవంబరు 1న రామ్‌లీలా మైదానం వరకు ర్యాలీ (జశీఅస్త్రతీవంం ూఖశ్రీశ్రీఎ) చేపట్టనున్నట్లు ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది. ఈ ర్యాలీకి ప్రతిపక్ష నేతలకంటే ఎక్కువ భాజపా (దీబీూ), దాని మిత్రపక్షాల నాయకులే ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇంత ఉత్సాహంతో పెద్ద ఎత్తులో పబ్లిసిటీ చేస్తున్నందుకు, ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే 7 రోజులు కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని కోరారు. అదే సమయంలో ఈ నిరసనలో పాల్గొనాలని విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వ్యాపారులకు పిలుపునిచ్చారు.'దేశ ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారు, ఈ అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము. మౌనంగా ఉండబోము. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించి, నియమ నిబంధనలను ఉల్లంఘించారు. ప్రశ్నలు అడిగిన వారిపై లాఠీలు ప్రయోగించారు. వాటన్నిటికీ ఇప్పుడు దేశం ప్రతిస్పందిస్తోంది. అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ముందుకు రండి. ఎందుకంటే ఓటు మీదే..పోరాటం కూడా మీదే' అని రాహుల్ సోషల్ మీడియా పోస్టులో ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇదిలా ఉండగా.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న ర్యాలీలో అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 30నుంచి నవంబర్ 1వరకు (మూడు రోజులు) ఢిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు సూచించారు. నవంబర్ 1న దేశరాజధానిలో నిర్వహించనున్న ర్యాలీలో దాదాపు 10లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ఉండేందుకు కేంద్రం ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. దేశ రాజధానిలో శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు

# ఆరు నెలల్లో 23 మరణశిక్షలు..! జడ్జి బదిలీ

మొదటిపేజీ తరువాయి

ముజఫర్‌నగర్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న రవి కుమార్ దివాకర్.. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో 11 కేసులకు సంబంధించి 23 మందికి మరణశిక్ష విధించి సంచలనం సృష్టించారు. బరేలీలో పనిచేసిన సమయంలోనూ 13 మరణశిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించారు. అయితే, హత్య, తీవ్ర నేరాలకు సంబంధించి విచారణ ప్రక్రియలో ఉన్న 97 కేసులను (ఓ న్యాయమూర్తి ఆదేశాల మేరకు) తన కోర్టు నుంచి ఉపసంహరించుకోవడాన్ని జడ్జీ దివాకర్ తప్పుపట్టారు. పదేళ్లనాటి కేసులో ఓ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించిన ఆయన.. విచారణలు ప్రారంభమైన కేసులను, చట్ట ప్రకారం నిబంధనలు పాటించకుండా పరిపాలనా ఉత్తర్వుల ద్వారా ఉపసంహరించుకోవచ్చా? అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన బదిలీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# తుపాను ముప్పును సమర్థంగా ఎదుర్కొందాం

మొదటిపేజీ తరువాయి

అమరావతి: అర్నబ్ తుపాను ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ నెల 28న బాపట్ల- విశాఖ మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉండటంతో ముందస్తు సన్నద్ధతపై సీఎం సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, జిల్లా కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులు, వ్యవసాయం, విద్యుత్, ఇరిగేషన్, హోం, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాలు, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

సహాయక చర్యల కోసం 10 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. ఈనెల 26న ఉదయానికి తుపానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా అర్నబ్ బలపడే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా సుమారు 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. కోనసీమ-యానాం-కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా.. కొన్ని సందర్భాల్లో వాటి వేగం 140 కిలోమీటర్లకు చేరవచ్చని హెచ్చరిస్తున్నారు. ఈనెల 27న ఉదయం నుంచే తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరిగే సూచనలున్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

## సైకిల్‌పై ఇంటింటికీ.. డెలివరీ ఏజెంట్‌కు అనంత్ అంబానీ ఊహించని కానుక!



బైక్ కొనే స్తోమత లేక.. సైకిల్‌పై ఇంటింటికీ తిరుగుతూ డెలివరీలు చేస్తున్న ఓ గిగ్ వర్కర్‌కు ఊహించని కానుక లభించింది. అనంత్ అంబానీ తరఫున ప్రతినిధి ఆయనకు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను బహుమతిగా అందజేశారు. ఈ క్రమంలోనే తీవ్ర భావోద్వేగానికి గురైన ఆ డెలివరీ ఏజెంట్ కంటతడి పెట్టారు. ముంబయికి చెందిన హుస్సేన్ మన్సూరి అనే ఇన్‌ఫ్లుయెన్సర్ దీనికి సంబంధించి ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. అది కాస్త వైరల్‌గా మారింది.

ముంబయిలో డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న సుజీత్ అనే వ్యక్తి సైకిల్‌పై విధులకు వెళుతుండగా రోడ్డుపై హుస్సేన్ మన్సూరి ఆయన్ను పలకరించారు. బైక్ ఎందుకు కొనుక్కోలేదని అడిగారు. అయితే.. చాలీచాలనీ వేతనంతో బండి కొనుగోలు చేసే శక్తి తనకు లేదని, అన్నింటి ధరలు పెరిగిపోయాయని ఆయన చెప్పారు. అయితే.. నీకో సర్‌ప్రైజ్ ఇస్తానని, డెలివరీ పూర్తి చేసి తిరిగి రావాలని హుస్సేన్ సూచించారు.

అలాగే తిరిగి వచ్చిన సుజీత్ కళ్లకు గంతలు కట్టి కొత్త స్కూటర్ రూపంలో సర్‌ప్రైజ్ ఇచ్చారు. అనంత్ అంబానీ తరఫున చిన్న బహుమతి అని తెలిపారు. దీంతో ఆయన ఆనందంతో ఉప్పొంగిపోయారు. మన్సూరిని హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. 'అనంత్ సేవా ఫౌండేషన్' చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ బహుమతిని అందజేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.

# మన రిజర్వేషన్లపై సమాలోచన" కార్యక్రమం విజయవంతం

**జనసముద్రం న్యూస్ అక్టోబర్ 26**
**సూర్యాపేట జిల్లా హుజూర్నగర్**
**నియోజకవర్గ రిపోర్టర్ అలవాల రవి**

యాదవుల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలి

యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జున యాదవ్ పిలుపునిచ్చారు.

హుజూర్‌నగర్‌లో యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన “రేపటి భవిష్యత్ తరాల కోసం… మన రిజర్వేషన్లపై -- సమాలోచన” ముఖాముఖి సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వక్తలు, సంఘం ప్రతినిధులు పాల్గొని రిజర్వేషన్ల ప్రాధాన్యత, యాదవ సామాజిక వర్గానికి సంబంధించిన హక్కులు, విద్యా--ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రిజర్వేషన్లు కేవలం ప్రస్తుత తరానికి మాత్రమే సంబంధించిన అంశం కాదని, రాబోయే భవిష్యత్ తరాల విద్యా, ఉద్యోగ, సామాజిక అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రిజర్వేషన్లకు సంబంధించిన చారిత్రక నేపథ్యం, ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, చట్టపరమైన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

యాదవ సామాజిక వర్గం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ





ఐక్యంగా ముందుకు రావాలని, యువతకు విద్యా అవకాశాలు పెంపొందించడంతో పాటు రాజకీయ చైతన్యం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మన హక్కుల గురించి తెలుసుకోవడం, వాటి సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశం లో హుజూర్నగర్ పట్టణ యాదవ సంఘం నాయకులు జక్కుల మల్లయ్య యాదవ్ గారు, యాదవ రాజ్యాధికార సాధన సమితి జిల్లా అధ్యక్షులు గొల్ల మల్లికార్జున్ యాదవ్ గారు, మహిళా అధ్యక్షురాలు వర్రె కవిత యాదవ్ గారు, హుజూర్నగర్ నియోజకవర్గం యాదవ ఉద్యోగ సంఘం అధ్యక్షులు జక్కుల వెంకటేశ్వర్లు యాదవ్ గారు, మాజీ కౌన్సిలర్ జక్కుల శంబయ యాదవ్ గారు, ౖాజూ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ గారు,¯=ూా రాష్ట్ర కోశాధికారి గంధం లింగయ్య యాదవ్ గారు, గుడిమల్కాపురం సర్పంచ్ పుల్లేడి శ్రీనివాసరావు యాదవ్ గారు, జక్కుల శ్రీరామ్ యాదవ్ గారు టీచర్, చిర్రా శ్రీనివాస్ యాదవ్ గారు, మద్దుల నాగరాజు యాదవ్ గారు, ముక్కెర్ల మట్టయ్య యాదవ్ గారు, జక్కుల కొండలు యాదవ్ గారు, జక్కుల నాగరాజు యాదవ్ గారు, జక్కుల లక్ష్మణ్ లెక్చరర్ గారు, పండగ కొరివి వీరయ్య యాదవ్ గారు, ఆవు దొడ్డి మహేష్ యాదవ్ గారు, చెవుల లింగయ్య యాదవ్ గారు, గోల కృష్ణయ్య యాదవ్ గారు, ఎల్లావుల శివశంకర్ యాదవ్ గారు, కుంటి గొల్ల నవీన్ యాదవ్ గారు,నాయకులకు, యువతకు, కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

“మన హక్కులపై మనకు అవగాహన ఉండాలి… మన భవిష్యత్ తరాల కోసం మనమంతా ఐక్యంగా కృషి చేయాలి.”

యాదవ రాజ్యాధికార సాధన సమితి

# అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దామెర వాసి గొర్రె థామస్

**●అంబేద్కర్ ఆశయాల సాధనకు మరింత కృషి చేస్తా -- థామస్**

**హనుమకొండ, అక్టోబర్ 25 (జనసముద్రం)**





తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గొర్రె థామస్ ఎన్నికయ్యారు.ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో థామస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.గతంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గొర్రె థామస్ సంఘం అభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల ప్రచారానికి విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. ఈ నియామకంపై ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన అంబేద్కర్ వాదులు, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గొర్రె థామస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్‌కు, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో తనకు సహకరించిన సంఘ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా అందరి సహకారంతో ఐక్యంగా ముందుకు సాగుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారంద స్వామి, అధికార ప్రతినిధి ఇసంపెల్లి రమేష్, గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య, ముఖ్య సలహాదారు ఇసంపెల్లి నీలయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వివేకానంద, జంగిలి భాస్కర్, వల్లందాస్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మండలంలో బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యం

**●మండలంలో బూత్ కమిటీల ఏర్పాటు:బీజేపీ నాయకులు**

**ఎల్కతూర్తి అక్టోబర్ 25 (జనసముద్రం)**





భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ, గోపాలపూర్ గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షత వహించారు.కోతులనడుమ గ్రామంలో 285, 286 బూత్‌లకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కనిపర్తి శామ్ సుందర్, ఎర్రోళ్ల అఖిల్, మాట్ల వినయ్, రావుల శ్రీధర్, మాట్ల విశాల్, రావుల శ్రీకాంత్, పల్లపు శ్రీను, గట్టు శ్రీనివాస్ బీజేపీలో చేరారు.పార్టీలో చేరిన వారికి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.గోపాలపూర్ గ్రామంలో 305వ బూత్ అధ్యక్షుడిగా కుమ్మరి సతీష్, 306వ బూత్ అధ్యక్షుడిగా చిత్రాల భాస్కర్, 307వ బూత్ అధ్యక్షుడిగా ఉప్పుల శివప్రకాష్ ఎన్నికయ్యారు.అదేవిధంగా చేరికల కమిటీ సభ్యుడిగా చిదురల వెంకటేష్‌ను నియమించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, బూత్ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శులు అల్లి కుమార్, చిత్రాల వెంకటేష్, సీనియర్ నాయకుడు కంచర్ల శంకరయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్రోళ్ల రాజు, మడిపల్లి కొమురయ్య, మాట్ల జయేందర్, చిరంజీవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్క్రూట్నీ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో దాసిరాజు

**●చెక్కుచెదరని 111 ఎంపీటీసీ నామినేషన్లు**
**●అధికారులను మెచ్చుకుంటున్న నామినేషన్ల నేతలు**

**మొగల్తూరు అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**




మొగల్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు శనివారం ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్కూటీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ నామినేషన్ల స్క్రూట్నీ కార్యక్రమాన్ని నర్సాపురం ఆర్డీవో కే దాసిరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్తూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన నామినేషన్ల ప్రక్రియ స్క్రూట్నీ కార్యక్రమంలో ఎటువంటి లోటు పాటులు అభ్యర్థులుకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. మండలంలో 21 ఎంపీటీసీలు వారిగా అభ్యర్థులను సమావేశపు హాలు లోనికి వరుసగా పిలిచి వారి సమక్షంలో అభ్యర్థుల సమక్షంలో స్క్రూట్నీ కార్యక్రమం నిర్వహించగా మొగల్తూరు మండలంలో 21 ఎంపీటీసీల లోను మొత్తం 111 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వానిలో నూటికి నూరు శాతం నామినేషన్లు స్కూటీనీలో నిలబడ్డాయని మొగల్తూరు మండల ఎన్నికల అధికారి, మొగల్తూరు మండల ప్రత్యేక అధికారి జి స్వాతి అన్నారు. శనివారం సాయంత్రం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సమాచారం అందించారు. తెలుగుదేశం 25, జనసేన 34, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 45, బిజెపి 2, స్వతంత్ర అభ్యర్థులు 5 మొత్తము 111 మంది అభ్యర్థులు ఉన్నారని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ అధికారి సిహెచ్ త్రిశూలపాణి, అబ్దుల్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# 19వ వార్డు లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కార్యక్రమం



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 25;**

మాచర్ల పట్టణ 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బండ్ల అనురాధ బ్రహ్మయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు, మాచర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, కొమెర చందు,. బృంగా బాబూ రావు , కామినేని వీరాంజినేయులు, బొట్లగుంట ఆంజినేయులు, వీరపునేని మనోజ్ కుమార్, వెలనాటి నరసింహారావు మరియు టిడిపి మహిళా కార్యకర్తలు పాల్గొని చైర్మన్ అభ్యర్థి సుష్మా కేశవ రెడ్డి కి, బండ్ల అనురాధ కి తమ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుకి వేసి భారీ మెజార్టీతో గెలిపించవలసిందిగా 19వ వార్డు ప్రజల్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణానికి గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం



వెల్దండ, అక్టోబర్ 25: మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన మల్లోజు మంజుల ఇంటి నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, నాయకులు బుచ్చిబాబు, గూళ్ల వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వెంకన్న నిత్యాన్నదానానికి విరాళం.



**జనసముద్రం న్యూస్/ ఏలూరు జిల్లా/ అక్టోబర్ 25 /ద్వారకాతిరుమల**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడ వాస్తవ్యులు పామర్తి విజయ భాస్కరరావు కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని అన్నదానం కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం ఏఈవో రమణ రాజు దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన బ్రాండ్ పత్రాన్ని అందజేశారు.

# ద్వారకాతిరుమల శేషాచల కొండపై వృద్ధుడి మృతదేహం

**జన సముద్రం న్యూస్ /ఏలూరు జిల్లా/అక్టోబర్ 25/ద్వారకాతిరుమల**



ద్వారకాతిరుమల శేషాచల కొండపై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమై కలకలం రేపింది.దుర్వాసన రావడంతో గమనించిన ఆలయ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి.సుధీర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.మృతుడిని తూర్పుగోదావరి జిల్లా గోకవరం ప్రాంతానికి చెందిన సత్యనారాయణగా గుర్తించారు. అయిదు రోజుల క్రితమే వృద్ధాప్యంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు...

**జన సముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.25.**

అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ హెచ్చరించారు. గుడివాడలో ఐస్‌క్రీమ్ బండ్లు, గూడు ఆటోలు, గూడు లారీలు, టార్పాలిన్ కట్టిన వాహనాలతో పాల వ్యానులతో సహా అన్ని వాహనాలను ఆయన తన సిబ్బందితో తనిఖీ చేశారు. స్థానిక ఎన్నికల్లో అక్రమ మద్యం తరలించేవారు ఎంతటివారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



సోమవారం అక్టోబర్ 26, 2026

# గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం

- ప్రజల మధ్యకు కూటమి అభ్యర్థి లోకం నాగలక్ష్మి నాని!
- మొగల్తూరు మండల అభివృద్ధే లక్ష్యం
- ప్రజల ఆశీర్వాదమే బలమంటున్న లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు

**మొగల్తూరు అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

మొగల్తూరు మండలం లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మొగల్తూరు మండలంలో రాజకీయ సందడి నెలకొంది. మొగల్తూరు మండలం జడ్పీటీసీ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (నాని) స్థానిక నాయకుల అండతో గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమెకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటుండటంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కుతోంది.

### గ్రామ గ్రామాన ప్రచారం.. ప్రజలతో మమేకం!

జడ్పీటీసీ అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చిన లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (నాని) ప్రతి గ్రామంలోనూ విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుంటున్నారు. ఓట్ల అభ్యర్థన పైనే కాకుండా గ్రామ ప్రజల సమస్యలు, గ్రామాల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరత, రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల చొరవ ఎంతో ముఖ్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో తాను ఎన్నికల బరిలోకి దిగినట్లు ఆమె ప్రచారంలో వివరిస్తున్నారు. ప్రజల ఆదరాభిమానాలను పొందుతూ, ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.





### అభ్యర్థికి బ్రహ్మరథం పడుతున్న కార్యకర్తలు!

లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (నాని) ఎన్నికల ప్రచారానికి కూటమి శ్రేణులు ఉత్సాహంగా సహకరిస్తున్నాయి. గ్రామాల్లో ఆమె పర్యటన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెంట నడుస్తూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. గ్రామ ప్రజలు సైతం ఆమెను ఆప్యాయంగా పలకరిస్తూ తమ మద్దతును తెలియజేస్తున్నారు.

కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ప్రతి ఓటరును కలుసుకోవడం, అభ్యర్థి లక్ష్యాలను ప్రజలకు వివరించడం, గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రచారంలో ప్రాధాన్యత ఇస్తున్నారు.

గ్రామాల్లో లభిస్తున్న ఆదరణతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. అయితే ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని, ప్రతి ఓటరును గౌరవిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

### గెలిపిస్తే అభివృద్ధికి పెద్దపీట!

మొగల్తూరు మండలంలో జడ్పీటీసీ స్థానం నుంచి విజయం సాధిస్తే మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (నాని) చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇస్తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు ఆమె ప్రచారంలో పేర్కొంటున్నారు. మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల మధ్య సమన్వయం అవసరమని, ఆ దిశగా కృషి చేస్తానని ఆమె వివరిస్తున్నారు. ప్రజలు తనకు ఒక్క అవకాశం కల్పిస్తే వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని, మొగల్తూరు మండల అభివృద్ధిని పరుగులు పెట్టించడమే తన ప్రధాన లక్ష్యమని చెబుతున్నారు.

### అభివృద్ధి నినాదంతో ముందుకు ప్రజల తీర్పుపై ఆశలు!

మొగల్తూరు మండల జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (నాని) గ్రామాల పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవడం, వారి సమస్యలను తెలుసుకోవడం, అభివృద్ధిపై తన ఆలోచనలను వివరించడం ద్వారా ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కూటమి నాయకులు, కార్యకర్తలు సైతం అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. మొత్తంగా మొగల్తూరు మండలంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (నాని) ప్రచారం ఎన్నికల వేడిని పెంచుతోంది. గ్రామాల్లో లభిస్తున్న ఆదరణ ఓట్ల రూపంలో ఎంతవరకు ప్రతి ఫలిస్తుందనేది ఎన్నికల ఫలితాల తర్వాత తేలనుంది. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి మండల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఆమె ముందుకు సాగుతున్నారు.

# ప్రశాంతంగా జరగిన వెల్దుర్తి మండల ఎంపీటీసీ నామినేషన్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, అక్టోబర్ 25;**



వెల్దుర్తి మండల ఎంపీటీసీ నామినేషన్ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వం లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ముగిసింది. జూలకంటి అక్కిరెడ్డి, కుర్రి శివారెడ్డి, కళ్ళం రామాంజి రెడ్డి, సంజీవరెడ్డి, కాబోయే ఎంపీపీ దేశావత్ మల్లయ్య నాయక్ కి మండలంలోని ప్రతి ఒక్క గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు చాలా సహకరించారు. ఈ నామినేషన్ సందర్భంగా మండల ఆఫీసు నుండి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసం వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గొర్ల వారి పుట్టినరోజు వేడుకలు

### రుద్విక్ ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అంజిబాబు





**భీమవరం ఎవరెవరు జనసముద్రం ప్రతినిధి**

అనాకోడరు గ్రామంలో గొర్ల నాగరాజు మనవడు రుద్విక్ మొదటి పుట్టినరోజు వేడుకలలో ఆదివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాల్గొని రుద్విక్ కు ఆశీర్వాదాలు అందించి అక్షింతలు వేశారు. రుద్విక్ మొదటి పుట్టినరోజు సందర్భంగా 100 మంది మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రుద్విక్ ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాక్షించారు.

# పేరుపాలెం సెంటర్లో రహదారిపైనే దుకాణాలు!

- ప్రయాణికులు, స్థానికులకు తప్పని ఇబ్బందులు
- రహదారిపై ఆక్రమణలతో రాకపోకలకు అంతరాయం

**మొగల్తూరు అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**



మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సెంటర్లో రహదారిపైనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై దుకాణాలు నిర్వహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుపాలెం సెంటర్ నిత్యం వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రహదారిపైనే దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రహదారి అందుబాటులో ఉన్న విస్తీర్ణం తగ్గి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

రహదారులు ప్రయాణానికెనా.?

రహదారులు ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సి ఉండగా, వాటిపైనే దుకాణాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు నిర్వహించుకోవడానికి అభ్యంతరం లేకపోయినా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

అధికారులు స్పందించాలి!

పేరుపాలెం సెంటర్లో రహదారిపై దుకాణాల నిర్వహణతో ఏర్పడుతున్న సమస్యను సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారులకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పేరుపాలెం సెంటర్లో రహదారిపై ఏర్పడుతున్న అడ్డంకులను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# చిట్టవరం ఎంపీటీసీ అభ్యర్థిగా ఉమాలక్ష్మి ఇంటింటా ప్రచారం

### ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి



**నరసాపురం, అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం చిట్టవరం ఎంపీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బుడితి శ్రీనివాస్ సతీమణి ఉమాలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆశీస్సులతో ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. నామినేషన్ అనంతరం శనివారం ఆమె చిట్టవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.

# మాజీ మంత్రి విడదల రజిని ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, చిలకలూరిపేట, అక్టోబర్ 25;**



చిలకలూరిపేటలోని మాజీ మంత్రి విడదల రజిని నివాసానికి వైఎస్సార్‌సీపీ కి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు వెళ్లారు. వారిలో మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి విడదల రజని కలిసి పరామర్శించారు.

# బండి ముత్యాలమ్మను దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్త సత్తినేని తాతాజీ

**మొగల్తూరు అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**



మొగల్తూరు మండలం కొత్తట గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సత్తినేని తాతాజీ ముత్యాలపల్లిలో వెలసి యున్న శ్రీ శ్రీ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానికంగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# :కనులపండువగా క్రిష్ణారెడ్డి దంపతులచే శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం...



**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.25.**

మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాస కళ్యాణం భక్తుల భక్తి భావాల నడుమ కనులపండువగా ఒక వేడుకగా జరిగింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులతో పాటు వారి కుమారులు వేంకట మానస్ వేంకట ప్రణయ్ కుటుంబ సమేతంగా నిర్వహించిన ఈ కళ్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవంలో పాల్గొని, వీక్షించి భక్తి తన్మయత్వంలో పరవశించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా ఉత్సవ మూర్తులను కళ్యాణ మండపానికి తోడ్కొని వచ్చి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమం మొత్తం భక్తి పారవశ్యంతో సాగి, భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పుష్పాలతో అలంకరించిన మండపంలో కళ్యాణం జరిపారు. స్వామివారికి పల్లకీ సేవను చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కళ్యాణంలో భక్తులకు సకల వసతుల్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కళ్యాణ ఏర్పాట్లను నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షించారు. ఈ కళ్యాణం లో మెయిల్ సీఈఓ పురిటిపాటి వేంకట సుబ్బారెడ్డి, సుమలత దంపతులు పాల్గొన్నారు.

# విజయవాడలో కేంద్ర మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా తో అంధ్రప్రదేశ్ ముదిరాజ్ (కోలి) నాయకుల మర్యాదపూర్వక భేటీ

**జనసముద్రంన్యూస్, విజయవాడ, అక్టోబర్ 25;**

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సందర్భంగా, విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ (కోలి) నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి విచ్చేసిన భారత ఆహార సంస్థ (ఎఫ్ సిఐ) సభ్యులు సత్యబోయిని నాగయ్య ముదిరాజ్ (కోలి) ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ (కోలి) నాయకులు, తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పీవీఎల్‌ఎన్ రాజు ముదిరాజ్ నాయకత్వంలో ఈ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా ముదిరాజ్ (కోలి) నాయకులతో ఎంతో ఆత్మీయంగా, స్నేహపూర్వకంగా మాట్లాడారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విచ్చేసిన ఆమెను విజయవాడలో కలుసుకుని, సమాజానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా వివరించే అవకాశం లభించడం నాయకులకు సంతోషాన్ని కలిగించింది.



కేంద్ర మంత్రి హోదాలో ఉన్నప్పటికీ, సమాజ్ నాయకులతో సాదరంగా సంభాషించడం, వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు అవకాశం కల్పించడం ఈ సమావేశంలో ప్రత్యేకంగా నిలిచింది. ఆమె చూపిన ఆత్మీయత, మర్యాదపూర్వక స్పందన పట్ల నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకుల మధ్య ఇలాంటి సమావేశాలు సమాజ సమస్యలను సంబంధిత స్థాయికి తీసుకెళ్లడానికి, అభివృద్ధికి సంబంధించిన అంశాలను చర్చించడానికి ఉపయోగపడతాయి.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని ముదిరాజ్ (కోలి) సామాజిక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, సామాజిక అభివృద్ధి, యువత భవిష్యత్తు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలను నాయకులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమాజంలోని అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సహకరించాలని, యువతకు విద్యా మరియు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి విచ్చేసిన సత్యబోయిని నాగయ్య ముదిరాజ్ (కోలి), తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పివిఎల్‌ఎన్ రాజు ముదిరాజ్ (కోలి), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు చొప్పర రాము (విజయవాడ), పెరుమాళ్ళ శివరామకృష్ణ (ధర్మారావుపేట), పిట్టల రాజు (విజయవాడ), యు. బ్రహ్మయ్య పిల్లి సూర్యప్రకాష్, బోడి మాధవి, పిల్లి పవన్ కుమార్ (విజయవాడ) మరియు స్నేహితులు వై.వి. శివాజీ, కోనేరు మంజుల రాణి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి శ్రీమతి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ముదిరాజ్ (కోలి) నాయకులకు ఆమెను కలుసుకునే అవకాశం లభించడం ప్రత్యేకంగా నిలిచింది. తమతో ఆత్మీయంగా మాట్లాడి, అభిప్రాయాలను తెలియజేసుకునే అవకాశం కల్పించినందుకు ఆమెకు నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేరుపాలెంలో ఇసుక మాఫియా ఆగడాలు!

- **దేవుని భూమిని సైతం వదలని ఇసుకాసురులు**
- **అధికారుల హెచ్చరికలు బేఖాతరు**
- **యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు?**

**మొగల్తూరు అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

మొగల్తూరు మండలం పేరుపాలెం ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. చివరకు దేవునికి సంబంధించిన భూములను సైతం వదలకుండా ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ నిబంధనలు, అధికారుల హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా కొందరు ఇసుకాసురులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### దేవుని భూమిపైనా కన్ను!

సాధారణ ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలే కాకుండా దేవునికి సంబంధించిన భూముల్లోనూ ఇసుక తవ్వకాలు



జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. పవిత్రమైన దేవుని భూములను సైతం అక్రమ తవ్వకాల కోసం వినియోగిస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### అధికారుల హెచ్చరికలు బేఖాతరు!

అక్రమ ఇసుక తవ్వకాలు, అనుమతులు లేకుండా ఇసుక తరలింపును అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏమేరకు అదుపులో ఉన్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇసుకాసురులపై చర్యలు తీసుకునేదెప్పుడు?

ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు భూముల స్వరూపాన్ని మార్చే అక్రమ తవ్వకాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పేరుపాలెం ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? దేవుని భూముల్లో తవ్వకాలు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు జరుగుతుంటే సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి పేరుపాలెం ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# స్వామి వివేకానంద నందనవనంలో స్వచ్ఛభారత్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 25;**

శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు మాచర్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్నటువంటి స్వామి వివేకానంద నందనవనంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఆదివారం జరిగినటువంటి కార్యక్రమంలో స్వామి వివేకానంద నందనవనములోని పిచ్చి మొక్కలను తొలగించి పూల మొక్కలకు సపోర్టులు వేసి కలుపు మొక్కలను వేరువేసి స్వామి వివేకానంద నందనవనం మొత్తాన్ని శుభ్రపరచినట్లు గోవింద రెడ్డి తెలిపారు. మానవ సేవ, మాధవ సేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో, పరిశుభ్రతలోనే పరమాత్ముడు





ఉన్నాడు అన్నా మహాత్మా గాంధీ స్ఫూర్తితో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యొక్క స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి పది గంటల వరకు ప్రభుత్వ ఆఫీసులలో, ప్రైవేట్ ఆఫీసులలో, స్కూల్స్, కాలేజీలు, దేవాలయాలు, చర్చిలు, మసీదుల దగ్గర ఈ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గోవిందరెడ్డి తెలిపారు. మాచర్ల పట్టణంలో ఎక్కడ ఆపరిశుభ్రంగా ఉంటే అక్కడ శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు ఉండే విధంగా కృషి చేస్తున్నట్లు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ.. మాచర్ల పట్టణంలో మొత్తం 300 మొక్కలను నాటివాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టినట్లు గోవిందరెడ్డి తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మహాత్ములు కలలు కన్నా నవభారత నిర్మాణానికి నాంది పలకాలని గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, గంద్రకోట శివ సుందర ప్రసాద్ , ఎర్రబోతుల నాగ శంకర్ రెడ్డి , రాజారావు, కండ్లకుంట అంగన్వాడి టీచర్ సిహెచ్ రుక్మిణి , సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆపస్ అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక





**-- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు శవన్న గారి బాలాజీ**

**రాయచోటి జనసముద్రం న్యూస్ అక్టోబర్ 25**

ఆపస్ అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం భానుహరి రెసిడెన్సీ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్న బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుని ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సంఘం బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, జిల్లా, మండల స్థాయిలో సంఘ కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై నాయకులు చర్చించారు, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని నాయకులకు తెలిపారు.

నూతన కార్యవర్గం వివరాలు:

- జిల్లా అధ్యక్షుడు: పరుశురాం
- జిల్లా ప్రధాన కార్యదర్శి: పచ్చార్ల సుధాకర్
- జిల్లా కోశాధికారి: సొరకాయల శ్రీనివాసులు
- జిల్లా సహాధ్యక్షుడు: కె. వెంకటేష్
- అదనపు ప్రధాన కార్యదర్శి: జి. బాలాజీ
- జిల్లా ఉపాధ్యక్షులు: శివశంకర, బాలరాజు, నాగులయ్య, భాస్కర్
- జిల్లా కార్యదర్శులు: రెడ్డి శేఖర్, బి. నాగరాజు

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శవన్న గారి బాలాజీ మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి జిల్లా, మండల స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జిల్లా వ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం స్పందించేందుకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ అన్నమయ్య జిల్లా నాయకులతో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# పెద్దగొన్నూరు లో ఎంపీపీ అభ్యర్థి కోటప్రోలు నాగరత్న కుమారి ప్రచారానికి విశేష స్పందన





**జనసముద్రం న్యూస్ కైకలూరు నియోజకవర్గం ప్రతినిధి: పండు బాబు**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం అక్టోబర్ 25 :ముదినేపల్లి మండల ఎంపీపీ అభ్యర్థిగా పెద్దగొన్నూరు ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తున్న కోటప్రోలు పూర్ణ సతీమణి కోటప్రోలు నాగరత్న కుమారి ఎన్నికల ప్రచారం సెగ్మెంట్ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది.

కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆశీస్సులతో, కె. యల్.నారాయణ మద్దతుతో పాటు ముదినేపల్లి మండల ఎన్డీఏ నాయకుల సహకారంతో ప్రచార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.నాయకులు, కార్యకర్తల సమన్వయం మరియు ప్రజల ఆదరణతో ప్రచార కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రచార కార్యక్రమంలో గుడివాడ వేణు, మాజీ సర్పంచ్ శివప్రసాద్, గంగయ్య, పరసా ఏడుకొండలు, రాజేష్, యేసు,చక్రపాణి,సుబ్బయ్య, ఎన్ డి ఏ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక శ్రేయోభిలాషులు పాల్గొని అభ్యర్థికి తమ మద్దతు తెలియజేశారు.

గ్రామ ప్రజలను కలుసుకుంటూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రచారం కొనసాగింది.

# ప్రశాంతంగా జరగిన వెల్దుర్తి మండల ఎంపీటీసీ నామినేషన్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, అక్టోబర్ 25;**

వెల్దుర్తి మండల ఎంపీటీసీ నామినేషన్ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వం లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ముగిసింది. జూలకంటి అక్కిరెడ్డి, కుర్రి శివారెడ్డి, కళ్ళం రామాంజి రెడ్డి, సంజీవరెడ్డి, కాబోయే ఎంపీపీ దేశావత్ మల్లయ్య నాయక్ కి మండలంలోని ప్రతి ఒక్క గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు చాలా సహకరించారు. ఈ నామినేషన్ సందర్భంగా మండల ఆఫీసు నుండి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసం వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటపాకలో పచ్చదనం పరిరక్షణకు పిలుపు: 'సేవా మిత్ర' ఆధ్వర్యంలో జమ్మూ ఉసిరి మొక్కలు నాటే కార్యక్రమం







**జనసముద్రం న్యూస్ ప్రతినిధి: పండు బాబు**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం అక్టోబర్ 25: కైకలూరు మండలం పరిధిలో గ్రామంలో సేవా మిత్ర " స్వచ్ఛంద సేవ సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కైకలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో- కన్వీనర్ పి రాధాకృష్ణ అన్నారు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీరబత్తిన సుధా సేవా మిత్ర సంస్థ ప్రతినిధి చిల్లిముంత రమేష్ స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు మరియు సేవా మిత్ర సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చింతలపల్లి గ్రామ శాఖ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా చిలుముల ప్రమోద్ ఎన్నిక

**•సమాజ మార్పుకు విద్య.. ఓటు హక్కు ప్రధాన ఆయుధాలు: సదానందం**

ఎల్కతుర్తి, అక్టోబర్ 25 (జనసముద్రం)



సమాజ మార్పుకు విద్య పునాది కాగా, రాజకీయాలను ప్రభావితం చేయడానికి ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల సదానందం అన్నారు. ఆదివారం తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలమకంటి దయాకర్ సూచనల మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొర్రె థామస్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తూముల సదానందం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనా విధానాలకు అనుగుణంగా సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దేశ రాజకీయాల్లో మార్పు తీసుకురావాలన్నా, పాలకులను ప్రశ్నించాలన్నా ఓటు హక్కు కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు అంబేద్కర్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని సామాజిక మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం, సామాజిక బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఒకరిలో ప్రారంభమయ్యే చైతన్యం వందల మందిలో మార్పునకు నాంది కావాలని ఆకాంక్షించారు. విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, బహుజనుల రాజ్యాధికార సాధనలో ఓటు హక్కుకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు రాజకీయ చైతన్యంతో ముందుకు సాగుతూ తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతులు దేశానికి వెన్నెముకగా నిలుస్తున్నారని, యువత నాయకత్వ లక్షణాలను



పెంపొందించుకొని దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. చింతలపల్లి గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక అనంతరం తెలంగాణ అంబేద్కర్ సంఘం ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బొంకూరి రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో చింతలపల్లి గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చిలుముల ప్రమోద్, ఉపాధ్యక్షుడిగా బొంకూరి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా బొంకూరి చందు, సహాయ కార్యదర్శులుగా చుంచు రాకేష్, చిలుముల అరుణ్, గౌరవ అధ్యక్షుడిగా బొంకూరి సదానందం, ముఖ్య సలహాదారుడిగా చిలుముల రమేష్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొంకూరి రవీందర్, అడ్డూరి రమేష్, అడ్డూరి ప్రశాంత్, చిలుముల వినోద్‌తో పాటు గ్రామానికి చెందిన జర్నలిస్టులు, పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా 12వ ఆంధ్ర అరుణాచల గిరి ప్రదక్షిణ మహోత్సవం.

**-జిల్లా లోనే ఏకైక ఆంధ్ర అరుణచల కుందుర్పి గిరి క్షేత్రం...**

**- భక్తిభవం,ఆద్యాత్మికను పెంపొందించేలా భక్తలులో చైతన్యం.**

**పౌర్ణమి సందర్భంగా పరమేశ్వర,కుందుర్పమ్మకు అమ్మవారికి విశేష పూజలు.**

కుందుర్పి, అక్టోబర్ 25, (జనసముద్రం న్యూస్):





ఎపిలోని అనంతపురం
జిల్లాలోన ఏకైక ఆంధ్ర అరుణచల గిరి క్షేత్రంగా కుందుర్పి ప్రసిద్ధి చెందుతుందినడంలో సందేహం లేదు. ఆదివారం మండల కేంద్రమైన కుందుర్పిలో 12వ ,ఆంధ్ర అరుణాచల గిరి ప్రదక్షిణ మహోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రతి పౌర్ణమి సందర్భంగా గ్రామస్తుల , కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత కుందుర్పమ్మ గుడి వద్ద అమ్మవారికి, పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వదేవతా సమ్మేళనంగా గ్రామంలో వెలసిన పలు దేవాలయాల మీదుగా భజనలతో ర్యాలీ చేపట్టి విశేష పూజలు చేపట్టారు. పూర్వం
శివపురంలో కుందుర్పమ్మ గిరి వెలసిందని, ఈ గిరిపైన గ్రామదేవత ఆదిశక్తి కుందుర్పమ్మ దేవత పులి వాహనంపై అధిష్టించినట్లు స్వయంభూగా వెలిసిందని భక్తుల నమ్మకం. అంతేకాకుండా ఈ గిరి మహా పరమేశ్వరుని రూపంలో ఆవిర్భవించిందని పురాణాలు చెబుతున్నాయి.
స్థానిక గ్రామ దేవత ఆలయం నుండి పలు దేవాలయాల మీదుగా గిరి ప్రదక్షిణను భక్తులు తప్పెట్లు వుర్రాలు మోదుతో గేయాలకు అనుగుణంగా భజనలు , నృత్యాల ప్రదర్శన, భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో పూజలు చేసి భక్తిభావం, ఆధ్యాత్మికతను చాటడం విశేషం. ఈ గిరి ప్రదక్షిణను భక్తులు సుమారు 6 కిలోమీటర్ల వైశాల్యాన్ని నాలుగు గంటలపాటు పూర్తి చేసి తిరిగి గ్రామదేవత ఆలయానికి చేరారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్న సంతర్పణ కార్యక్రమాలను నిర్వాహకులు చేపట్టారు. పరమేశ్వర ,అమ్మవారి అనుగ్రహం భక్తులు ప్రజలందరిపై వుండాలని కోరారు. అంతక మునుపు కాషాయ రంగు జెండాను చేతబూని భక్తులు "కుందుర్పమ్మ మాతాకి జై, పరమేశ్వర పాహిమాం పాహిమాం జై" అంటు నామస్మరణలతో కుందుర్పి గ్రామంలో దద్దరిల్లింది.
తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలం తరహాలోనే కుందుర్పిలో గిరి పరమేశ్వర రూపంలో వెలసిందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు.
గ్రామదేవత వెలసిన పవిత్ర క్షేత్రం.
ప్రతి పౌర్ణమి రోజున గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలతో 6 కి.మీ గిరి ప్రదక్షిణ చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు.
స్థానిక గ్రామ దేవత ఆలయం నుండి ప్రారంభమై పలు దేవాలయాల మీదుగా సాగే ఆధ్యాత్మిక యాత్ర శోభాయమానంగా కొనసాగింది.
12 నెలలుగా నిర్విరామంగా కొనసాగుతున్న మహోత్సవం భక్తులలో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యం వచ్చిందన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 32వ వార్డులో టీడీపీ అభ్యర్థి జెట్ల సుశీలకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

నరసాపురం అక్టోబర్ 25 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి





నరసాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 32వ వార్డులో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి జెట్ల సుశీల కి మద్దతుగా నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, నరసాపురం పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సంక్షేమం, వార్డు అభివృద్ధి లక్ష్యంగా కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి, జెట్ల సుశీల ని గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## జర్నలిస్టుల సమస్యలపై సమష్టి పోరాటం.

**- రాష్ట్ర అధ్యక్షులు నారగోని పోరుషోత్తం, ప్రధానకార్యదర్శి తోకల అనిల్.**

తొర్రూర్ / మహబూబాబాద్ జిల్లా/ జన సముద్రం న్యూస్ /,అక్టోబర్ 25 :






జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై సమష్టిగా పోరాడుతూ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగోని పోరుషోత్తం, ప్రధానకార్యదర్శి తోకల అనిల్, జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ దీర్ పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఛాంబర్స్ అఫ్ కామర్స్ హాలులో టీఎస్ జేయూ తొర్రూర్ డివిజన్ సమావేశం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ పంతం సురేందర్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు ఇప్పించేందుకు యూనియన్ చర్యలు తీసుకుంటోందని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ లు జిల్లాలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించే విధంగా ఉద్యమించాలన్నారు. అదేవిధంగా నిరంతరం జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సామాజిక కార్యక్రమాలలో కూడా పాల్గొనాలని ఆయన సూచించారు. అనంతరం తొర్రూర్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పానుగోత్ బాలాజీ,ఉపాధ్యక్షులుగా వేర్పుల మహేందర్, మంగళపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా ధర్మారపు యాకయ్య, జెల్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా తండ రవి, మునిగేటి గిరిధర్,కోశాధికారి శ్రీనివాస్ చారి, జిల్లా మీడియా ఇంచార్జి మిడతపల్లి సురేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు పంతం విజేందర్, శ్యామ్, యాకయ్య, ప్రవీణ్, ఉపేందర్, పరశురాం, మెంగు సతీష్ శ్రీనివాస్ గౌడ్, వినోద్ కుమార్, కృష్ణ , ప్రవీణ్ ఉపేందర్ పరశురాం సతీష్ యాకయ్య శ్రీనివాస్ ఉపేందర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
మహబూబాబాద్ జిల్లా

## కూటమి ఎంపీపీ అభ్యర్థి ఏపూరి పావని ఉత్సాహ ప్రచారం

జన సముద్రం న్యూస్/ఏలూరు జిల్లా/అక్టోబర్ 25/ద్వారకాతిరుమల



గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ఆశీస్సులతో ద్వారకాతిరుమల మండల కూటమి ఎంపీపీ అభ్యర్థి మరియు గుండుగోలనుకుంటా ఎంపీటీసీ అభ్యర్థి ఏపూరి పావని ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. రెండో రోజు గుండుగోలనుకుంటా గ్రామంలో కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ ప్రచారంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పల్లి రాంబాబు, పాకలపాటి శ్రీను, సొసైటీ మాజీ చైర్మన్ తూంపాటి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, జనసేన అధ్యక్షులు బండారు సుధాకర్, బీజేపీ అధ్యక్షులు జంగా కృష్ణ, మాజీ సర్పంచ్ జంగా నరసింహారావు, బోట్ల సాయి, మధ్యాహ్నపు దుర్గారావు, మధ్యాహ్నపు వేణు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దుర్గి 2 ఎంపిటిసి అభ్యర్థిగా మేకల రామారావు నామినేషన్

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, దుర్గి, అక్టోబర్ 25;



మాచర్ల నియోజకవర్గంలో మండల కేంద్రమైన దుర్గి 2 ఎంపీటీసీ అభ్యర్థి గా మేకల రామారావు ముదిరాజ్ నామినేషన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

## దేదీప్యమానంగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...

జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.25.



భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

## శ్రీ వేంకటేశ్వరునికి భక్తకోటి మొక్కుల చెల్లింపు...

జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.25.



మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు అత్యధికంగా విచ్చేసి తమ తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

